క్లుప్తంగా

భోజనం బాగుందా?

చిలమత్తూరు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆర్డీఓ ఆనంద్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. భోజనం బాగుందా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. మెనూ తప్పక పాటించాలని ఎస్‌ఓ సునీతకు సూచించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


చిన్నారులతో మాట్లాడుతున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి- 2 అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ ఈరన్న గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రీ స్కూల్ పిల్లలు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వీరేష్

అగళి: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ వీరేష్, రొళ్ల ఎస్‌ఐ వీరాంజనేయులు హెచ్చరించారు. గురువారం మండలంలోని నరసబుంది గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్‌ఐలు వీరేష్, వీర ఆంజనేయులు నాకాబందీ నిర్వహించారు. గ్రామంలో అనుమానితుల ఇళ్లు, గడ్డివాముల వద్ద సోదాలు చేశారు. ద్విచక్రవాహనాలు పత్రాలు, నంబర్ ప్లేట్స్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రీరాములు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ నూతన కమిటీ ఎన్నిక


వినోద్ కుమార్, సీపీఐ కార్యదర్శి


హిందూపురం టౌన్: 27 మంది సభ్యులతో పట్టణ సీపీఐ కమిటీని జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ ప్రకటించారు. రెండవ సారి సీపీఐ హిందూపురం కార్యదర్శిగా వినోద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన సహాయ కార్యదర్శిగా మారుతిరెడ్డి, రెండవసారి సహాయ కార్యదర్శిగా ఇస్మాయిల్ ఖాన్ చోటు దక్కించుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా సీనియర్ నాయకులు డి.బాబు, చౌలూరు సీపీ రవికుమార్, చలపతి, సమీవుల్లా, జబివుల్లా, కమల్ భాష, చాంద్ బాషా, శ్రీనివాసులు, నరసింహమూర్తి, చంద్ర, సాబీర, కస్తూరి, అనూష, ముంతాజ్, మబ్బూన్, ఇమ్రాన్, నౌషాద్, లక్ష్మీనారాయణ, అన్వార్, సురేష్, కృష్ణ, ముత్యాలప్ప, పూజారి వెంకటేష్, తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 31న ధర్మవరం పట్టణంలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

27న సీపీఎం జిల్లా మహాసభలు


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

మడకశిర: కదిరిలో ఈనెల 27,28న జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు యోగానంద్, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు గోవిందప్ప, మండల కార్యదర్శి రవి, ముత్యాలు తదితరులు కోరారు. గురువారం పట్టణంలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు.

మౌలాలి జెండా ఆవిష్కరణ


జెండాను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

అమరాపురం: స్థానిక పాత మసీదు వద్ద మౌలాలి ఉరుసు ఉత్సవాలను భక్తులు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మౌలాలి దేవుడికి ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. జెండాను పట్టణ పురవీధుల గుండా భక్తులు ఊరేగించారు.

కేటీ హళ్లి అధ్యక్షుడిగా శ్రీనివాస నాయక

పావగడ: తాలూకాలోని కేటీ హళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా జేడీఎస్ మద్దతుదారుడు శ్రీనివాసనాయక ఎన్నికయ్యారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో జేడీఎస్ అభ్యర్థి శ్రీనివాస నాయక 8 ఓట్లతో విజయం సాధించాడు. మొత్తం ఓట్లు 16 ఉండగా ఒక సభ్యుడు గైర్హాజరు కాగా రెండు చెల్లని ఓట్లుగా పరిగణింప బడ్డాయని ఎన్నికల ఈఓ జానకిరామ్ తెలిపారు. ప్రత్యర్థి కాంగ్రెస్ మద్దతు దారుడు మంజునాథ్‌కు 5 ఓట్లు వచ్చాయి. నూతన అధ్యక్షుడు శ్రీనివాస నాయకను మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, నాయకులు సన్మానించారు.

ప్రత్యామ్నాయంపైనే ఆశలు

- మొక్కజొన్న, పత్తి సాగుపైనే ఆశలు
- బోరు బావుల కింద సాగు చేసేందుకు ఏర్పాట్లు


మడకశిర ప్రాంతంలో సాగు చేసిన మొక్కజొన్న పంట


పత్తి పంట సాగు చేసిన దృశ్యం

మడకశిర రూరల్: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు వేరుశనగ సాగు చేస్తే దిగుబడి పొందొచ్చని ఆశపెట్టుకున్నారు. అదనులో పదును కాలేదు. సాగుకు సమయమైనా సరైన వర్షం కురవలేదు. దీంతో వేరుశనగ సాగుపై పెట్టుకున్న రైతుల ఆశలు అడియాసలయ్యాయి. చేసేదిలేక ప్రత్యామ్నాయ పంటలపైనే ఆశలు పెట్టుకున్నారు. మిగిలిన పంటల కంటే మొక్కజొన్న, పత్తి సాగు చేస్తే మేలైన దిగుబడి పొందొచ్చని బోరుబావుల కింద సాగు చేశారు.

ప్రత్యామ్నాయ పంటలే మేలు..

గతేడాది కూడా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి రైతులు ఆదాయం పొందారు. ఈ ఏడాది మొక్కజొన్న ధర కూడా బాగుంటుందని భావిస్తున్నారు. ఈసారి ఎకరా మొక్కజొన్న సాగుకు ఎరువులు, మందులు, విత్తనాలు, కలుపు తీత, కూలీలకు దాదాపు రూ.20 వేలు వెచ్చించారు. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చేలా ఉంది. ధర బాగుంటే పెట్టుబడి పోనూ ఎకరాకు రూ.35 వేలకు పైగా ఆదాయం వస్తుంది. దీంతో రైతులు ఆసక్తిని పెంచుకుని బోరు బావుల కింద మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. ఈ పంటలో నష్టం రాదని రైతులు భావించి రైతులు మక్కువ చూపుతున్నారు.

పత్తి సాగు:

ఎకరా పొలంలో పత్తి పెట్టేందుకు రైతులు విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీ ఖర్చులు రూ.8 వేల వరకు ఖర్చు పెట్టారు. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ పత్తి క్వింటా రూ.7 వేల నుంచి రూ.7,500 వరకు ధర ఉంటుంది. మరికొంత మంది రైతులు ఎకరాకు రూ.70 వేల వరకు ఖర్చు పెట్టి క్రాస్ పత్తి సాగు చేశారు. ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు పత్తి విత్తనాల దిగుబడి వస్తుందని, క్వింటా విత్తనాలు రూ.45 వేల వరకు ధర ఉంటుందని భావిస్తున్నారు.

గత ప్రభుత్వంలో ప్రోత్సాహం:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బోరు బావుల కింద మొక్కజొన్న, రాగి, పత్తి పంటల సాగును ప్రోత్సహించింది. గ్రామ స్థాయిలో రైతులు ఈ పంటల సాగుపై ఆసక్తి పెంచుకునేలా అవగాహన కల్పించింది. రైతు నష్టపోకుండా పండించిన పంటలకు మద్దతు ధర కల్పించి అప్పటిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టింది. కూటమి ప్రభుత్వంలో అలాంటి ప్రోత్సాహం లేకపోయిందని చెప్తున్నారు.

మడకశిర డివిజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగు ఇలా..

మొక్కజొన్న	- 1,700 హెక్టార్లు
పత్తి పంట	- 1,998 హెక్టార్లు

6 ఎకరాల్లో మొక్కజొన్న వేశాం



ఈ ఏడాది బోరు బావి కింద అప్పులు చేసి 6 ఎకరాల్లో యాజమాన్య పద్ధతులను పాటిస్తూ మొక్కజొన్న పంటను సాగు చేశాను. ఎకరా పంట సాగుకు విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీ కలిసి రూ. 19 వేల ఖర్చు పెట్టా. ఈ నెలాఖరిలో పంట కోతకు వస్తుంది. మంచి ధర ఉంటే ఎకరాకు రూ.35 వేలకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

– శ్రీరామరెడ్డి , రైతు ఎల్లోటి, మడకశిర మండలం

10 ఎకరాల్లో పత్తి పంట సాగు



బోరుబావి కింద ఎకరాకు రూ.80 వేల వరకు విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీల ఖర్చులు పెట్టి 10 ఎకరాల్లో క్రాస్ పత్తి పంట సాగు చేశాను. పంట ఆశాజనకంగా ఉంది. దిగుబడి కూడా బాగా వచ్చే అవకాశం ఉంది. అప్పు చేసి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్నాం.

– దివాకర్, రైతు చందకచెర్లు, మడకశిర మండలం


నేడు 'బాబు ష్యూరిటీ'–మోసం గ్యారంటీ

అమరాపురం: స్థానిక వీరశైవ కళ్యాణ మంటపంలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, ఎంపీపీ ఈరన్న, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మడకశిర నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, హిందూపురం పార్లమెంట్ ఇంచార్జ్ రమేష్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఆర్గనైజింగ్ యాక్టివిటీ కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి హాజరు కానున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని రాష్ట్ర అనుబంధ, జిల్లా అనుబంధ కమిటీ సభ్యులు, మడకశిర నియోజకవర్గం ఎస్సీ, బీసీ, ఐటి వింగ్, మండలంలోని ప్రజా ప్రతినిధులు, మాజి డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని వారు కోరారు.

రొళ్లలో రేపు..

రొళ్ల: స్థానిక లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవనం ఆవరణలో శనివారం ఉదయం 11 గంటలకు 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ' కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌తో పాటు హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, రాష్ట్ర ఆర్గనైజేషన్ యాక్టివిటీ వజ్రభాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు.

మారెమ్మదేవికి జ్యోతుల ఉత్సవం


మారెమ్మదేవికి పూజలు చేస్తున్న అర్చకుడు కరియప్ప


టీడీ పల్లిలో మారెమ్మదేవి ఆలయం చుట్టూ జ్యోతులతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

రొళ్ల: మండలంలోని తిరుమలదేవరపల్లిలో వెలసిన గ్రామ దేవత మారెమ్మదేవికి గ్రామస్తుల ఆధ్వర్యంలో జ్యోతుల ఉత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు నియమనిష్టలతో బియ్యం పిండితో చేసిన జ్యోతులతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా మోసుకెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఎస్సీ కాలనీలో కూడా మారెమ్మదేవికి మహిళలు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


మాట్లాడుతున్న టింబక్టు-కలెక్టివ్ వ్యవస్థాపకుడు బబ్లూ గంగూలి

రొద్దం: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. గురువారం కోగిర వన సంరక్షణ ప్రాంతంలో కల్పవల్లి వృక్ష పెంపకందారుల పరస్పర సహాయ సహకార సంఘం 17వ వార్షిక మహాసభ నిర్వహించారు. పలువురు సంఘం సభ్యులు మాట్లాడుతూ టింబక్టు–కలెక్టివ్ సహకారంతో 33 ఏళ్లుగా ఉమ్మడి భూముల సంరక్షణ, భూమి, నీరు, పర్యావరణ సమతుల్యత కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏడాదిలో జరిగిన కార్యక్రమాల నివేదిక, ఆడిట్ రిపోర్టు, సొసైటీ పాలకవర్గ మార్పులు, చేర్పులు, మొగ్గ కార్యక్రమంపై చర్చించారు. చిగురు చిన్నారులు నృత్యాలు, ముష్టికోవెల యువత కోలాటం, ప్రదర్శన, చక్కభజన, అటవీ సంరక్షణపై ప్రదర్శించిన నాటకం అలరించింది. సంస్థ స్థాపకులు మేరి వటవట్టం, బబ్లూ గంగూలి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకన్య, వనసంరక్షణ సభ్యులు, అధ్యక్షులు, డైరెక్టర్లు, టింబక్టు–కలెక్టివ్ సిబ్బంది, కల్పవల్లి సొసైటీ సీఈఓ చిరంజీవి, ప్రకృతి గ్రూప్ మేనేజర్ శ్రీకాంత్, మేనేజర్లు రమేష్, మహేశ్, జయశ్రీ, విభ, మహిత తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓగా విజయభాస్కర్



పరిగి: మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా విజయభాస్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈఓఆర్డీగా పని చేసిన శ్రీధర్ కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి ఈఓఆర్డీ పోస్టు ఖాళీగా ఉంది. మండలపరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న విజయభాస్కర్‌ను అధికారులు డిప్యూటీ ఎంపీడీఓ(ఈఓఆర్డీ)గా నియమించారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి


నినాదాలు చేస్తున్న బీఎస్పీ నాయకులు

హిందూపురం: 'బీసీలు మేల్కొని రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి. అగ్ర కులాల నాయకులు రాష్ట్రం, దేశాన్ని ఏళ్లతరబడిగా పాలిస్తున్నారు. అయినా బీసీలకు అవకాశాలు ఇవ్వడం లేదు' అని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, రాయలసీమ జోన్ ఇన్‌చార్జి శ్రీరాములు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సుబ్బరాయప్ప అధ్యక్షతన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట వడ్డే నాగరాజ్ మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి పాలన ఏడాది పూర్తయినా ప్రజలు సుభిక్షంగా లేరన్నారు. నాయకులు వారి స్వప్రయోజనాల కోసమే పాటుపడుతున్నారని ఎద్దేవా చేశారు. బీసీలకు చేసిందేమి లేదని గుర్తు చేశారు. అందరూ ఐక్యమై రాజ్యాధికారం కోసం పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మౌలాలి, నాగరాజు, తిరుమలేష్, వెంకటరాముడు, గంగాధరప్ప, రామాంజనప్ప, నారాయణప్ప, సురేష్, శంషాద్, పల్లా నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: తుంగభద్ర తాగునీటి పథకాన్ని ఈ నెల 21న ప్రారంభిస్తున్న సీఎం సిద్ధ రామయ్య బహిరంగ సభకు తాలూకా వ్యాప్తంగా వేలాదిగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి వెంకటరమణప్ప మాట్లాడారు. గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని శాశ్వత తుంగభద్ర తాగునీటి పథకాన్ని సీఎం సిద్ధ రామయ్య చేసి చూపించారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ తుంగభద్ర తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్ధ రామయ్య చొరవను కొనియాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్ బాబు, రూరల్ అధ్యక్షుడు రామాంజినప్ప, ఏ శంకరరెడ్డి, టీ నరసింహయ్య, అన్నదానపల్లి లక్ష్మినారాయణ, నివృత్త న్యాయమూర్తి వేణు గోపాల్, ఫజులుల్లా, బత్తినేని నాని, ఉషారాణి, సుమ అనిల్ పాల్గొన్నారు.

ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలి


లేపాక్షిలో ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

లేపాక్షి: రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌కు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని కోరుతూ గురువారం మండలంలోని లేపాక్షి, కల్లూరు గ్రామ ప్రజలు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పోస్టు కార్డులను పంపించారు. అంతకుముందు సేవ్ ఆర్డీటీ అంటూ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు.

సోమందేపల్లి: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని కోరుతూ గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు పోస్టు కార్డులు పంపారు. వైద్య, విద్య రంగానికి ఆర్డీటీ ఎంతో కృషి చేసిందని విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ నాయకులు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాలలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించి మొక్కల చుట్టూ పాదులు చేశారు. వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రతాప్, రామన్న, చంద్రమోహన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు తనిఖీ

రొళ్ల: మండలంలోని జీఎస్ పాళ్యం, ఎస్‌పీ గొల్లహట్టి, వన్నప్పపాళ్యం, గుడ్డగుర్కి తదితర గ్రామాల ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ శ్రీధర్ గురువారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లింక్ డ్యూటీలపై ఆర్టీసీ కార్మికుల నిరసన

పెనుకొండ: లింక్ డ్యూటీలపై కండక్టర్లు, డ్రైవర్లు గురువారం ఆర్టీసీ డిపో ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లకు లింక్ డ్యూటీలతో చార్ట్ వేస్తున్నారన్నారు. దీంతో పని భారం ఎక్కువై కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈక్రమంలో కొందరు గుండెపోటుకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చట్ట విరుద్ధమైన లింక్ డ్యూటీలను తొలగించి కొత్త చార్ట్‌లను అమలు చేయాలని కోరారు. నాయకులు రమణా, లతీఫుల్లా, నాగరాజు, శ్రీనివాసరావు, ఖలీల్, తదితరులు వున్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

గుడిబండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాల– అనర్థాలపై గురువారం అవగాహన కల్పించారు. బాలికలు యుక్త వయస్సు రాక ముందు బాల్య వివాహాలు జరిపిన, సహకరించిన, హాజరైన కూడా శిక్షర్హులు కాగలని హెచ్చరించారు. గ్రామ స్థాయిలో సర్పంచులు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీ వర్కర్లు, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య, ఆశ వర్కర్లు, వార్డు మెంబర్లు , స్వచ్ఛంద సంస్థ సభ్యులు తల్లిదండ్రులకు బాలిక వివాహాలపై అవగాహన కల్పించారు.

మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయండి

పరిగి: పెనుకొండ నియోజకవర్గంలో మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయాలని జైభీమ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం డిప్యూటీ తహసీల్దార్ హనుమంతుకు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి నాయకులు పరిగి చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రమేష్, నరసింహమూర్తి, మధు, హనుమంతు పాల్గొన్నారు.

స్టార్టర్ పెట్టెకు నిప్పు


కాలిపోయిన స్టార్టర్ పెట్టె

పెనుకొండ రూరల్: చిన్నపరెడ్డిపల్లిలో గ్రామ పంచాయతీకి చెందిన స్టార్టర్ పెట్టెకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి నీటిని అందించే స్టార్టర్ పెట్టెకు రెండు రోజుల క్రితం గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టినట్లు సర్పంచ్ అశ్వర్థనారాయణ అనుమానం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిరరూరల్: మండలంలోని ఆర్.అనంతపురం, కల్లుమర్రి విద్యుత్ సబ్ స్టేషన్‌ల్లో లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

చిలమత్తూరు: 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మరవకొత్తపల్లి సమీపంలోని విరాట్ ప్యాలెస్‌లో వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ ఎస్.రామకృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు ఇచ్చిన అబద్ధపు హామీలను గుర్తుకు తెచ్చేందుకు పార్టీ రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను సమన్వయకర్త టీఎన్ దీపిక ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ పరిశీలకుడు రమేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పాల్గొంటారన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నేతలు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా చాముండేశ్వరి దేవి జయంతి


పూజలు చేస్తున్న మహిళలు

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠాపురం చాముండేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహికంగా కుంకుమార్చన పూజ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

స్పందించి.. వైద్యం అందించి


వృద్ధుడిని ఆస్పత్రిలో చేర్చిన ట్రస్టు సభ్యులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఆటోనగర్ వద్ద ఉన్న భగీరథ సర్కిల్‌లో అంజినప్ప అనే 70 ఏళ్ల వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజులుగా డివైడర్ దగ్గరే పడుకుంటున్నాడు. ఆహారం లేక ఇబ్బందులు పడుతున్న వృద్ధుడి దీన పరిస్థితిని పట్టణానికి చెందిన అల్ ఇందాద్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలుసుకున్నారు. గురువారం ఆ వృద్ధుడిని 108 సహాయంతో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులతో మాట్లాడి అతడికి వైద్యం చేయించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అమన్, సాధిక్, అరాఫత్, రిహాన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప సీజ్


సాక్షి ఎఫెక్ట్..

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం తూముకుంట పారిశ్రామిక వాడలో కర్ణాటక నుంచి అక్రమంగా టెక్స్‌పోర్ట్ మిల్, ఫ్లోకెమ్ కెమికల్స్‌కు తరలిస్తున్న కలపను అటవీశాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు జూన్ 13న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'జోరుగా కలప దందా' కథనానికి అటవీశాఖ అధికారులు స్పందించారు. కలప అక్రమ రవాణాపై నిఘా పెట్టారు. రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. దాడుల్లో అటవీశాఖ అధికారులు కేశప్ప, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

రొళ్ల: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని మండల పరిషత్ ఏఓ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో గ్రామాల అభివృద్ధి ప్రణాళికతో పాటు సీ–4 సర్వే పై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందికి ఒక రోజు శిక్షణ ఇచ్చారు.

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రామరావు ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి– ప్రణాళికల తయారీపై కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులకు గురువారం అవగాహన కల్పించారు. ఏ పనులు చేపట్టాలి తదితర వివరాలను ఆర్‌ఓ ఈరన్న అవగాహన కల్పించారు.